# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 102 ప్రకాశం, సోమవారం 12- 01 - 2026 పేజీలు : 4 వెల. 2 /-







## దివి తిరుపతినాయుడుకు పరామర్శఎమ్మెల్యే ఇంటూరి



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్ ,**నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దివి తిరుపతి నాయుడు అనారోగ్యంతో విజయవాడలోని ఎన్ ఆర్ ఐ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఏంఎల్ ఏ ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు..

## పోలేరమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కావ్య



**కావలి కంచర్ల మల్లికార్జున రావు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,**జలదంకి మండలం లోని బ్రాహ్మణ క్రాక అగ్రహారం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తల్లి పొంగళ్ళు మహొూత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా ఆదివారం జరిగింది. ఈ మహొూత్సవంలో కావలి నియోజకవర్గ శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులను తీసుకున్నారు.కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలేరమ్మ తల్లి దర్శనం చేసుకున్న ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, ఐశ్వర్యవంతంగా ఉండాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా ఆయన ..మాట్లాడుతూ, గ్రామ దేవతల పండుగలు ప్రజల్లో ఐక్యతను, భక్తిని పెంపొందిస్తాయని అన్నారు.సంప్రదాయాలు,సంస్కృతిని కాపాడుకోవడంలో ఇటువంటి మహొూత్సవాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. పోలేరమ్మ తల్లి కృపతో గ్రామం ఎల్లప్పుడూ శాంతి, సమృద్ధితో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు మహొూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## న్యాయ కళాశాల విద్యార్థుల ఫ్రీ లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 11,**రొంపిచర్ల మండల కేంద్రంలో ఆదివారం ఎంఏఎం న్యాయ కళాశాల విద్యార్థులు ఫ్రీ లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన చట్టాలు, న్యాయ హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ రామ శేషగిరిరావు, ప్రిన్సిపల్ వీరబ్రహ్మం, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వారు సూచించారు.




## గిన్నిస్ వరల్డ్ రికార్డులో కావలి కూచిపూడి చిన్నారులు

### -అభినందించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

**కావలి, కంచర్ల మల్లికార్జునరావు క్రైం కౌంటర్ ప్రతినిధి,**శ్రీ మేధా నృత్య కళానిలయం విద్యార్థుల చారిత్రక విజయం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో డిసెంబర్ 27న నిర్వహించిన భారీ కూచిపూడి నృత్య కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా, కావలి పట్టణానికి చెందిన శ్రీ మేధా నృత్య కళానిలయం నృత్య బృందం ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ నృత్య బృందానికి గురువుగా ఉన్న కోవూరు సరయు కృష్ణ నేతృత్వంలో 13 మంది చిన్నారులు ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డులో పాల్గొని రికార్డును కైవసం చేసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో వేలాది మంది బాలబాలికలు ఏకకాలంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రపంచ రికార్డు నెలకొల్పగా, అందులో కావలి ప్రాంతానికి చెందిన చిన్నారుల భాగస్వామ్యం పట్టణ ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. సంప్రదాయ భారతీయ నృత్యకళను ప్రపంచ వేదికపై నిలబెట్టడంలో శ్రీ మేధా నృత్య కళానిలయం విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకొని కావలి పట్టణం లోనిక్లబ్ ప్రాంగణంలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కావలి ఏఎంసీ డైరెక్టర్ కొప్పోలు లక్ష్మి సాదు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు నిర్వహించిన కార్యక్రమంలో, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గురువు సరయు కృష్ణతో పాటు గిన్నిస్ వరల్డ్ రికార్డులో పాల్గొన్న చిన్నారులను చిరు సత్కారంతో ఘనంగా అభినందించి ఆశీర్వదించారు. చిన్నారుల ప్రతిభను ప్రశంసిస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"చిన్న వయసులోనే శాస్త్రీయ నృత్యకళలో ప్రావీణ్యం సాధించి గిన్నిస్ వరల్డ్ రికార్డు స్థాయిలో పాల్గొనడం అత్యంత గర్వకారణం. గురువు కోవూరు సరయు కృష్ణ శిక్షణ, కృషి వల్లే ఈ పిల్లలు ఇంత గొప్ప విజయం సాధించారు. కావలి పేరు ప్రపంచ పటంలో నిలిచేలా చేసినందుకు వారందరికీ హృదయపూర్వక అభినందనలు" అని అన్నారు.తల్లిదండ్రులు పిల్లలను కళల వైపు ప్రోత్సహించడమే కాకుండా, గురువులపై నమ్మకం ఉంచి అండగా నిలవడం



వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా కావలి ప్రాంతంలోని కళా ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి, అలహరి సుధాకర్,కావలి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,గుత్తికొండ కిషోర్,పట్టణ ప్రధాన కార్యదర్శి,జ్యోతి బాబురావు,పట్టణ పార్టీ మహిళా అధ్యక్షురాలు హర్షయా బేగం ,సోమశిల మాజీ చైర్మన్,కండ్లగుంట మధుబాబు నాయుడు,టిడిపి నాయకులు బుర్ర శ్రీధర్ రెడ్డి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ఏం సి డైరెక్టర్ పవన్,టిడిపి సీనియర్ నాయకులు గాదంశెట్టి వేణు, నాయుడు రాంప్రసాద్, తిరువీధి ప్రసాద్, పసుపులేటి బాబురావు ఓగిరాల సుధాకర్. ఓగిరాల రాంబాబు, తోకల వెంకటేశ్వర్లు,కునపరెడ్డి కేశవరావు,మారిశెట్టి రమేష్,మునగ మురళి,శ్రీధర్,శానం హరి,షేక్ అలహర్,బిట్రగుంట వెంకట్రావు,వల్లేరి కిరణ్ కుమార్, షేక్ అలహర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యుత్ ఇంజినీరింగ్ తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం





**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** పట్టణంలోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో 2006 సంవత్సరంలో ఉత్తీర్ణత పొందిన విద్యుత్ ఇంజినీరింగ్ తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇరవై ఏళ్ల విరామం తర్వాత పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాసం చేసిన కళాశాలకు రావడంతో ప్రాంగణం ఆత్మీయ జ్ఞాపకాలతో ఉప్పొంగింది.

దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వృత్తి నిర్వహణలో ఉన్న సుమారు ఇరవై ఐదు మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పూర్వ విద్యార్థులు కళాశాల యాజమాన్య సభ్యులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చదలవాడ రవి కుమార్, ఉప ప్రిన్సిపాల్ హరి బాబు, అంతర్గత నాణ్యత హామీ విభాగ సమన్వయకర్త డాక్టర్ కె. సుబ్బారెడ్డి, విద్యుత్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ మీరా షరీఫ్, ఏ.ఓ దాసరి కొండల్ రావు పాటు విభాగ అధ్యాపకులను పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమావేశాలు విద్యాసంస్థల అభివృద్ధికి కీలకమని తెలిపారు. ఇరవై ఏళ్ల తర్వాత తమ పాత విద్యార్థులను అదే ప్రాంగణంలో చూడడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చదలవాడ రవి కుమార్, ఉప ప్రిన్సిపాల్ హరి బాబు, డాక్టర్ కె. సుబ్బారెడ్డి, ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ శాఖలో సహాయ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్న పూర్వ అధ్యాపకులు డి.ఎస్.ఆర్ తమ అనుభవాలు, పూర్వ విద్యార్థులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ వృత్తి జీవితంలో సాధించిన విజయాలకు కళాశాల అందించిన క్రమశిక్షణ, విలువలు, మార్గదర్శకత్వమే పునాదిగా నిలిచాయని కృతజ్ఞతలు తెలిపారు. విద్యాభ్యాస కాలంలో సంస్థ అభివృద్ధికి విశేష సేవలందించిన స్వర్గీయ డాక్టర్ కె. రామయ్య గారిని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

ఈ సమావేశంలో భాగంగా భోజన కార్యక్రమం, సాంస్కృతిక వినోదాలు నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ పాత తరగతి గదులు, ప్రయోగశాలలను సందర్శించి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

## విశాఖ బ్రాండ్ ఇమేజ్‌తో ఆడుకుంటే చర్యలు తప్పవని చంద్రబాబు హెచ్చరిక

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 11,** విశాఖపట్నంలో ఓ మహిళపై జరిగిన దాడి కేసును గంటల వ్యవధిలోనే ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్న నగర పోలీసుల పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. స్పష్టమైన ఆధారాలు లేకపోయినా, కేసును ఛేదించడంలో పోలీసులు చూపిన చొరవ, వృత్తి నైపుణ్యం ప్రశంసనీయమని కొనియాడారు. ఇదే సమయంలో, విశాఖ బ్రాండ్ ఇమేజ్‌కు భంగం కలిగించేలా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. రెండు రోజుల క్రితం విశాఖ నగరంలోని జగదాంబ సెంటర్ వద్ద విజయదుర్గ అనే మహిళపై ఓ వ్యక్తి దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ ఘటనపై ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పాటు, పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై తక్షణం స్పందించిన పోలీసులు, రంగంలోకి దిగి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఎలాంటి బలమైన ఆధారాలు లేనప్పటికీ, తమ నైపుణ్యంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అయితే, ప్రాథమిక విచారణలో నిందితుడి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తేలింది.ఈ పరిణామంపై బాధితురాలు విజయదుర్గ పోలీసుల పనితీరు పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం ఇచ్చిన వెంటనే వారు స్పందించిన తీరు అద్భుతమని చెప్పారు. అనంతరం ఆమె స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, నిందితుడిని చూసి అతను మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్లు నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని, బదులుగా మానసిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలని పోలీసులకు ఆమె విజ్ఞప్తి చేయడం గమనార్హం.



# ఏ ఎస్ ఐ అబ్దుల్ సేవలు మరువ లేనివి! వక్తలు



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**నా పదవీ విరమణ మహోత్సవానికి విచ్చేసి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి పేరు,పేరునా ధన్యవాదాలను విశ్రాంత ఏఎస్ఐ. అబ్దుల్ రహిమాన్ దంపతులు ధన్యవాదాలను తెలియజేశారు. పట్టణంలోని ఆదిత్య గ్రాండ్ రెస్టారెంట్ లో పదవి విరమణ సభ ఆదివారం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ33. సంవత్సరాలు పోలీస్ శాఖలో వివిధ హోదాలలోపనిచేసి పదవీ విరమణ చేసిన అబ్దుల్ రహమాన్ దంపతులను బంధుమిత్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత అబ్దుల్ రెహ్మాన్ మాట్లాడుతూ తన పదవి విరమణ కార్యక్రమానికి విచ్చేసి , తనను ఆశీర్వదించి , తనపై అవ్యాజ్యమైన ప్రేమను చాటుకున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన అభినందనలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షునిగా యూసుఫ్ అధ్యక్షత వహించారు. ఏకేయుఫిజికల్ డైరెక్టర్, డాక్టర్ సయ్యద్ ఆసీఫ్ ఉద్దీన్,సీనియర్ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు, మాలకొండయ్య, ఎం కె,( విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, తెదేపా సీనియర్ నాయకుడు, మాదాల మాల్యాద్రి, పలువురు అబ్దుల్ రహిమాన్ స్నేహితులు, బంధుమిత్రులు, పాల్గొని రహిమాన్ దంపతులకు పూలమాలలను వేసిశాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

# హైదరాబాద్ సచివాలయంతో పోల్చలేం: మంత్రి నారాయణ

**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 11** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్సార్‌సీపీ నేతలు అమరావతి గురించి చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని రాజేశాయి. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ దీనిపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అమరావతిని హైదరాబాద్ రాజధానితో పోల్చలేమని మంత్రి నారాయణ తెలిపారు. ప్రపంచంలోని టాప్ 5 రాజధానుల్లో అమరావతి ఒకటిగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. దీనిలో ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల కార్యాలయాలు అన్నీ ఒకేచోట ఉంటాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలకు ఆయన స్పందిస్తూ, హైదరాబాద్ సచివాలయంతో పోల్చడం సరికాదని అన్నారు. అమరావతి ప్రపంచంలోని 5 టాప్ రాజధానుల్లో ఒకటి కానుంది. అలాంటి దాన్ని హైదరాబాద్ సచివాలయంతో పోల్చలేమని ఆయన స్పష్టం చేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, “సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతిలో కట్టే సచివాలయాన్ని హైదరాబాద్ సచివాలయంతో పోల్చుతున్నారు. హైదరాబాద్ సచివాలయాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులు, సిబ్బంది కోసమే నిర్మించారు. హెచ్‌ఓడీలు ఇతర ప్రాంతాల్లో ఉన్నారు. కానీ అమరావతిలో నిర్మించే సచివాలయం అలా కాదు. ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులతో పాటు విభాగాధిపతి కార్యాలయాలు, కార్పొరేషన్లు ఉంటాయి. అన్నీ ఒకేచోటకు తీసుకొస్తే ప్రజలకు పరిపాలన తేలికగా ఉంటుందని ఇలా నిర్మిస్తున్నాం. అమరావతి గురించి పూర్తిగా తెలుసుకొని మాట్లాడాలి. సగం తెలుసుకుని మాట్లాడుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అమరావతిని



ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నామని, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు, టెలిఫోన్ కేబుళ్లు వంటివన్నీ భూగర్భంలోనే ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి ఒక్కటే రాజధాని అని స్పష్టత ఉందని, అయితే వైఎస్సార్‌సీపీ రాజధాని ఎక్కడో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్.. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా అంగీకరించారని, నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలని ఆయనే చెప్పారని మంత్రి నారాయణ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో గందరగోళం సృష్టించారని, రాజధాని రైతులకు ఇబ్బందులు కలిగించారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు అమరావతి రైతులు, మహిళలు సంతోషంగా ఉన్నారని, అమరావతిని ఆపడం సాధ్యం కాదని తెలిసి వైఎస్సార్‌సీపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మంత్రి నారాయణ విమర్శించారు.

# విశాఖ బ్రాండ్ ఇమేజ్‌తో ఆడుకుంటే చర్యలు తప్పవని చంద్రబాబు హెచ్చరిక



**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 11** విశాఖపట్నంలో ఓ మహిళపై జరిగిన దాడి కేసును గంటల వ్యవధిలోనే ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్న నగర పోలీసుల పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. స్పష్టమైన ఆధారాలు లేకపోయినా, కేసును ఛేదించడంలో పోలీసులు చూపిన చొరవ, వృత్తి నైపుణ్యం ప్రశంసనీయమని కొనియాడారు. ఇదే సమయంలో, విశాఖ బ్రాండ్ ఇమేజ్‌కు భంగం కలిగించేలా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. రెండు రోజుల క్రితం విశాఖ నగరంలోని జగదాంబ సెంటర్ వద్ద విజయదుర్గ అనే మహిళపై ఓ వ్యక్తి దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ ఘటనపై ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పాటు, పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై తక్షణం స్పందించిన పోలీసులు, రంగంలోకి దిగి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఎలాంటి బలమైన ఆధారాలు లేనప్పటికీ, తమ నైపుణ్యంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అయితే, ప్రాథమిక విచారణలో నిందితుడి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తేలింది. ఈ పరిణామంపై బాధితురాలు విజయదుర్గ పోలీసుల పనితీరు పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం ఇచ్చిన వెంటనే వారు స్పందించిన తీరు అద్భుతమని చెప్పారు. అనంతరం ఆమె స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, నిందితుడిని చూసి అతను మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్లు నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని, బదులుగా మానసిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలని పోలీసులకు ఆమె విజ్ఞప్తి చేయడం గమనార్హం. ఈ మొత్తం ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విశాఖలో శాంతిభద్రతలు ఎంత అద్భుతంగా ఉన్నాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. మహిళల భద్రత విషయంలో విశాఖ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని గుర్తుచేశారు. ప్రజల భద్రతకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులకు సూచించారు. చిన్న చిన్న ఘటనలను అడ్డం పెట్టుకుని ప్రభుత్వంపై బురద జల్లాలని చూస్తూ, విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయాలని ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

# నంద్యాల జిల్లాలో భారీ గోవుల అక్రమ రవాణా గుట్టురట్టు అర్ధరాత్రి రంగంలోకి దిగి కంటైనర్లను అడ్డుకున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 11** నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డలో గోవుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టయింది. స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అర్ధరాత్రి సమయంలో స్వయంగా రంగంలోకి దిగి ఐదు కంటైనర్లలో అక్రమంగా తరలిస్తున్న వందలాది గోవులను రక్షించారు. ఈ ఘటన జాతీయ రహదారిపై తీవ్ర కలకలం రేపింది. తెలంగాణ నుంచి కడప జిల్లాకు భారీ కంటైనర్లలో గోవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం ఎమ్మెల్యే అఖిలప్రియకు అందింది. దీంతో ఆమె వెంటనే స్పందించి, అర్ధరాత్రి ఆళ్లగడ్డ సమీపంలోని అల్ఫా ఇంజనీరింగ్ కాలేజీ వద్ద జాతీయ రహదారిపై కాపుకాశారు. వేగంగా వస్తున్న ఐదు కంటైనర్లను తన సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ప్రతి కంటైనర్‌లో సుమారు 70కి పైగా గోవులను ఒకదానిపై ఒకటి పడేలా, ఊపిరాడకుండా అత్యంత దారుణంగా కుక్కి తరలించడం చూసి ఆమె చలించిపోయారు. ఈ కంటైనర్లకు ఎస్కార్ట్‌గా ఒక ఇన్నోవా కారు కూడా వెళుతున్నట్లు గుర్తించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ మూగజీవాలను ఇలా నరకప్రాయంగా తరలించడం అమానుషం. ఇలాంటి అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 10 లారీలు అప్పటికే తప్పించుకుని వెళ్లిపోయాయని ఆమె తెలిపారు.రక్షించిన 350కి పైగా గోవులను పోలీసులకు అప్పగించి, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు జరిపించాలని ఆమె ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, గోప్రేమికులు ఎమ్మెల్యే చర్యను ప్రశంసిస్తున్నారు.

# దారం మాల్యాద్రి కుటుంబాన్ని పరామర్శ ఎమ్మెల్యే ఇంటూరి



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ దారం మాల్యాద్రి తల్లి సరోజనమ్మ ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దారం మాల్యాద్రి ఇంటికి వెళ్లి సరోజనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులను అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు , ఇతర నాయకులు పాల్గొన్నారు.

# సంక్రాంతిపండుగశుభాకాంక్షలు



**లింగ సముద్రం క్రైమ్ కౌంటర్ ప్రతినిధి,** సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై ఎం. నారాయణ తెలియజేశారు .ప్రధానంగా కోడిపందాలు, జూదము తదితర అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించిన, ప్రోత్సహించిన, సహకరించిన వారిపై కఠినమైన చట్టపరమైనచర్యలను ఉంటాయనిహెచ్చరించారు .సంక్రాంతి పండుగను సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించుకోవాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల మీద నిరంతరం ప్రత్యేక టీమ్ లతో నిఘాను ఉంచామని తెలిపారు. ముందస్తు చర్యలో భాగంగా పాత నేరస్తులను కొంతమందిని బైండోవర్ చేసి వారిపై నిఘా ఉంద నీ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే లింగసముద్రం పోలీస్ వారికి డయల్ 100 /112 ద్వారా తెలియజేయాలని కోరారు. సమాచారం లేకుండానే పోలీస్ దాడులు ఉంటాయని హెచ్చరించారు.

# బాల విహార్ శిక్షణా తరగతులు

## ప్రతిభ చాటిన విద్యార్థులు

**ఒంగోలు క్రైశీకౌంటర్ ప్రతినిధి,**లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో ఆదివారం శ్రీగిరి దేవస్థానం గో శాల భవనంలో నిర్వహించిన శ్రీగిరి బాల విహార్ శిక్షణా తరగతులలోపాల్గొన్న విద్యార్థులు భగవద్గీత హనుమాన్ చాలీసా గోవింద నామాలు వంటి వాటితో పాటు నీతి పద్యాలు పురాణ కథలు పురాణ పాత్రలు రామాయణం బొమ్మల పుస్తకానికి రంగులు వేయడం వంటి అంశాలలో చక్కటి ప్రతిభను కనబరిచారు.

ఆదివారం జరిగిన శిక్షణ తరగతులకు శ్రీగిరి దేవస్థానం వేద పండితులు పి భాను ప్రకాష్ శర్మ , భాగవత ప్రచార సేవా సమితి అధ్యక్షులు ఎం వి ఎస్ శాస్త్రి ఆధ్వర్యం వహించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పిల్లలకు సదాచారాన్ని ఉత్తమ సంస్కారాలను అలవాటు చేసినట్లయితే వారు తమ జీవితంలో ఉన్నత స్థాయిని అందుకోగలుగుతారని తెలిపారు.

అలాగే ప్రతి ఆదివారం శ్రీగిరి గో క్షేత్ర భవన్ లో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు జరిగే బాలవిహార్ శిక్షణా తరగతుల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. తల్లిదండ్రులు గురువులు భగవంతుని ప్రతిరూపాలని వారి పాదాలకు నమస్కరించడం ద్వారా భగవంతుని కృపకు అనుగ్రహానికి పిల్లలు పాత్రులు కాగలుగుతారని కార్యక్రమ నిర్వాహకులు తెలియ చెప్పారు, మరో దివ్య తిరుమలగా పేరొందిన శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ విశేషాలను శ్రీ గిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు కృషిని కార్యక్రమ నిర్వాహకులు వివరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



# విశాఖలో హెరిటేజ్ వాకింగ్ ట్రాక్,,,,,జీవీఎంసీ కీలక నిర్ణయం



**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 11** విశాఖపట్నం అనగానే మనందరికీ గుర్తొచ్చేది సాగర తీరం, అలల హెూరు, అందమైన పర్యాటక ప్రాంతాలు, కానీ విశాఖపట్నం నగరానికి వందల ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఆ చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా అద్భుతమైన చారిత్రక కట్టడాలు ఉన్నాయి. విశాఖ చరిత్రను నేటి తరానికి తెలియజేసేందుకు, విశాఖపట్నంలోని చారిత్రక కట్టడాలను పరిచయం చేసేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నంలోని చారిత్రక కట్టడాలను కలుపుతూ హెరిటేజ్ వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయాలని జీవీఎంసీ నిర్ణయం తీసుకుంది. విశాఖలోని వన్ టౌన్ ప్రాంతంలో 1.6 కిలోమీటర్ల మేరకు ఈ హెరిటేజ్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు.

పూర్ణా మార్కెట్ నుంచి పాత పోస్టాఫీస్ వరకూ కేవలం వాకర్స్ (పాదచారులు) కోసం ఈ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. ఆరు అడుగుల వెడల్పుతో ఈ వాకింగ్ ట్రాక్ నిర్మించనున్నారు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ పొడవు ఉండే ఈ హెరిటేజ్ వాకింగ్ ట్రాక్‌లోకి వాహనాలు ప్రవేశించకుండా.. ఇరువైపులా స్టడ్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్గంలో బ్రిటిష్ కాలం. అంతకు ముందు నాటి నిర్మాణాలు చూడొచ్చు, ఈ పురాతన కట్టడాల మీదుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి చారిత్రక కట్టడం వద్ద ఆ నిర్మాణం ప్రాముఖ్యతను తెలియేజేసేలా బోర్డులను ఏర్పాటు చేయనున్నారు.

బ్రిటిష్ పరిపాలనకు చిహ్నంగా నిలిచే క్వీన్ విక్టోరియా పెవిలియన్‌తో పాటుగా సెయింట్ అలోసియస్ స్కూల్, క్వీన్ మేరీస్ స్కూల్ , హిందూ రీడింగ్ రూమ్, యూరోపియన్ సెమెట్రీ,1930లో నిర్మించిన మున్సిపల్ కార్యాలయం ఈ మార్గంలోనే ఉన్నాయి. సర్వధర్మ సమభావన చాటే, విశాఖపట్నం ప్రత్యేకతను తెలియజేసే శృంగమణి కొండపై వేంకటేశ్వర స్వామి ఆలయం, రోస్ హిల్ పై చర్చి, దర్గా కొండపై బాబా ఇషాక్ మదీనా దర్గా ఈ వాకింగ్ ట్రాక్ సమీపంలోనే ఉన్నాయి.

హెరిటేజ్ వాకింగ్ ట్రాక్ ప్రాజెక్టు విశాఖ నగరం వైభవాన్ని పర్యాటకులకు తెలియజేస్తుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ హెరిటేజ్ వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి వస్తే, విశాఖపట్నం కేవలం పారిశ్రామిక నగరంగానే కాకుండా పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా మరింత గుర్తింపు పొందుతుందని అధికారులు చెప్తున్నారు.

# ఉద్యానానికి ఊతం జిల్లాలో సాగవుతున్న అరటి

**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 11** మార్కాపురం, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో చేయూత ఇచ్చి వారిని లాభాలబాటలో నడిపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు రూ.950కోట్లు ఖర్చు చేయనున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు మేలు జరిగేలా త యారు చేసిన ఈ ప్రాజెక్ట్‌కు పూర్వోదయ స్కీం ద్వారా కేంద్రప్రభుత్వం వాటాగా 60 శాతం నిధులు సమకూర్చనుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 40 శాతం అందించనుంది. ఆ మొత్తాన్ని రానున్న ఐదేళ్లలో ఖర్చు చేసి రైతులకు మేలు జరిగేలా హబ్‌ను తీర్చదిద్దనుంది. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతులందరికీ మేలు జరగనుండగా ఉద్యాన పంటల సాగులో ముందంజలో ఉన్న మార్కాపురం జిల్లా రైతులకు దీనిద్వారా మరింత ప్రయోజనం చేకూరనుంది.

మార్కాపురం జిల్లాలోని 21 మండలాల్లోనూ ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. త్వరలో ఈ కార్యక్రమం ప్రారంభమైతే జిల్లా రైతుల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మారిపోయి అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడతాయని ఉద్యానశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

18 రకాల పంటలకు చేయూత

ప్రధానంగా మార్కాపురం జిల్లాలో మిర్చి, బొప్పాయి, అరటి తదితర పంటలను ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏటా సుమారు 52వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తుంటే అందులో కొత్తగా ఏర్పడిన జిల్లాలోనే 32వేల ఎకరాల సాగు ఉంటుందని అంచనా. అలాగే అరటి, బొప్పాయి పంటలు కూడా ఇక్కడే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ హబ్ ద్వారా మొత్తం 18 రకాల పంటల సాగుకు చేయూత ఇచ్చేలా రూపకల్పన చేశారు. అరటి, మామిడి, బొప్పాయి, నిమ్మ, టమాటా, మిర్చి తదితర పంటల సాగుకు మేలు చేకూరుతుంది.



హార్టికల్చర్ హబ్ ఏర్పాటు ద్వారా రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల పెంపు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి ప్రాధాన్యత దక్కుతుంది.

హబ్ ఏర్పాటుతో ఉద్యాన రైతులకు మేలు

గోపీచంద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

హార్టికల్చర్ హబ్ ద్వారా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు మేలు చేకూరుతుంది. ఆర్థిక అభివృద్ధితోపాటు వారికి కొత్తరకం సాగు విధానాలు, స్థానికంగానే ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాకింగ్ సదుపాయాలు, పంటలకు కచ్చితమైన ధరల నిర్ణయం వంటి అంశాల ద్వారా ప్రయోజనం కలుగుతుంది. ఈ కార్యక్రమం ప్రారంభించిన తరువాత ఐదేళ్లపాటు రైతుల కోసం నిధులు ఖర్చు చేసి వారికి లబ్ధిచేకూరేలా హబ్ కార్యకలాపాలు సాగుతాయి.

# మలయాళం వర్సెస్ కన్నడ.. కేరళ కొత్త బిల్లుపై కర్ణాటక అసంతృప్తి



**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 11** కేరళ ప్రభుత్వం ప్రతిపాదించిన మలయాళ భాషా బిల్లు 2025 పై పొరుగు రాష్ట్రం కర్ణాటక వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తోసిపుచ్చారు. ఈ బిల్లుపై వస్తున్న ఆందోళనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని.. ఇది ఏ భాషను ఎవరిపై బలవంతంగా రుద్దే ప్రయత్నం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ బిల్లుకు సంబంధించి కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాసిన లేఖను ఎక్స్‌లో పోస్ట్ చేసిన పినరయి విజయన్.. దానిపై వస్తున్న ఆరోపణలపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.

కర్ణాటక అభ్యంతరాలు ఏంటి?

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ మలయాళ భాషా బిల్లు 2025పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఇటీవల లేఖ రాశారు. కాసరగోడ్ వంటి కేరళ-కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని కన్నడ మీడియం పాఠశాలల్లో కూడా మలయాళాన్ని మొదటి భాషగా తప్పనిసరి చేయడం భాషా స్వేచ్ఛను హరించడమేనని ఆ లేఖలో సిద్ధరామయ్య పేర్కొన్నారు. భాషా మైనారిటీల హక్కులను కాపాడేందుకు రాజ్యాంగపరంగా అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో ఈ బిల్లును అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

పినరయి విజయన్ వివరణ సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై స్పందించిన పినరయి విజయన్ సోషల్ మీడియా వేదికగా బిల్లులోని నిబంధనలను వివరించారు. కన్నడ, తమిళం మాట్లాడే ప్రజల హక్కులను కాపాడటానికి బిల్లులో స్పష్టమైన క్లాజులు ఉన్నాయని ఆయన తెలిపారు. నోటిఫైడ్ ప్రాంతాల్లోని ప్రజలు సెక్రటేరియట్ లేదా స్థానిక కార్యాలయాలకు కన్నడ లేదా తమిళ భాషల్లోనే దరఖాస్తులు పంపవచ్చని, ప్రభుత్వం కూడా అదే భాషలో సమాధానం ఇస్తుందని కేరళ ముఖ్యమంత్రి వివరించారు. మలయాళం మాతృభాష కాని విద్యార్థులు నేషనల్ ఎడ్యుకేషన్ కరికులమ్ ప్రకారం తమకు నచ్చిన భాషను ఎంచుకోవచ్చని, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు మలయాళ పరీక్షలు తప్పనిసరి కాదని పినరయి విజయన్ స్పష్టం చేశారు. కేరళ భాషా విధానం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 346, 347.. అధికార భాషా చట్టం 1963కి లోబడి ఉందని విజయన్ పేర్కొన్నారు. భారతదేశ వైవిధ్యాన్ని గౌరవించడం, ప్రతి పౌరుడి భాషా గుర్తింపును కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

# అయోధ్య రామ మందిరంలో నమాజ్ చేసేందుకు ప్రయత్నం.

**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 11** అయోధ్యలోని రామ మందిర సముదాయంలో ఓ వ్యక్తి నమాజ్ చేయడానికి ప్రయత్నించడం కలకలం రేపింది. అతడిని భద్రతా సిబ్బంది అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిని కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాకు చెందిన అహ్మద్ షేక్‌గా గుర్తించారు. 55 ఏళ్ల ఆ వ్యక్తి శుక్రవారం (డిసెంబర్ 9) అత్యంత భద్రత ఉండే ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించాడని.. దర్శనం చేసుకున్న తర్వాత సీతా రసోయి ప్రాంతం సమీపంలో కూర్చుని నమాజ్ చేయడానికి ప్రయత్నించాడని అధికారులు వెల్లడించారు. అహ్మద్ షేక్ నమాజ్ చేయడానికి ప్రయత్నిండగా.. అతడి చేష్టలను గమనించిన ఆలయ భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అనంతరం విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. అయితే అహ్మద్ షేక్ ఏ ఉద్దేశంతో ఆలయానికి వచ్చాడు, అతడి తెలుసుకోవడానికి దర్యాప్తు, నిఘా సంస్థలు అతడిని విచారిస్తున్నాయని పోలీసులు తెలిపారు. అతడు అయోధ్యకు ఎందుకు వచ్చాడు, ఈ ఘటనలో ఇంకెవరి హస్తం ఉంది అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, ప్రాథమిక తనిఖీల్లో అతడి వద్ద జీడిపప్పు, ఎండుద్రాక్ష వంటి వస్తువులను పోలీసులు గుర్తించారు. క విచారణ సందర్భంగా తాను అజ్మీర్ వెళ్తున్నట్లు అహ్మద్ షేక్ పోలీసులకు చెప్పాడు. ఈ ఘటనతో అయోధ్య రామ మందిర పోలీసులు అలర్ట్ అయ్యారు. సీనియర్ పోలీస్ అధికారులు, నిఘా అధికారులు రామ మందిర సముదాయంలోని భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.



# ఆనంద జలతాండవం

**క్రైం కౌంటర్ న్యూస్,**పుంగనూరు, జనవరి 8: హంద్రీనీవా జలాలతో చెరువులు కళకళలాడుతున్నాయి. కరువు ప్రాంత రైతుల్లో ఆనందకాంతులు నింపుతున్నాయి. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరుతోంది.

రాయలసీమకు వరప్రసాదిని

కరువు ప్రాంత రైతులకు హంద్రీనీవా వరప్రసాదినిగా మారింది. తాజాగా మదనపల్లె హంద్రీనీవా-సుజలస్రవంతి సర్కిల్ పరిధిలో 176 చెరువులు పూర్తిగా నిండాయి. 37 చెరువులు పాక్షికంగా నిండాయి. మరో 99 చెరువులను నింపాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటి వరకు నిండిన చెరువులతో దాదాపు 20వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. అంతేకాక భూగర్భ జలాలూ పెరుగుతున్నాయి.

నిండిన చెరువుల వివరాలు

పుంగనూరు బ్రాంచి కెనాల్ పరిధిలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో 36 చెరువులు పూర్తిగా.. రెండు పాక్షికంగా, మదనపల్లెలో 3 పూర్తిగా.. మరో మూడు పాక్షికంగా, పుంగనూరులో నాలుగు పూర్తిగా.. ఒకటి పాక్షికంగా, పలమనేరులో 5, కదిరిలో 4 చెరువులు పూర్తిగా నిండాయి. కుప్పం బ్రాంచ్‌కెనాల్ పరిధిలో 85 పూర్తిగా.. 16 పాక్షికంగా, పలమనేరులో 39 పూర్తిగా.. 15పాక్షికంగా చెరువులు నిండాయి. సీఎం ఆదేశాలతో చివర కుప్పం నుంచి కృష్ణాజలాలను చెరువులకు అనుసంధానిస్తూ తూములు, పైపుల ద్వారా నీటిని విడుదల చేశారు. పుంగనూరు మండలంలో ఈడిగపల్లె వద్ద సన్యాసిచెరువు, మంగళం చెరువు, లద్దిగం చెరువు, కొండసముద్రం, పుంగమ్మచెరువుకు నీరు వెళ్లాయి. వాటినుంచి చైన్‌సిస్టం ద్వారా మొరవనీటిని దిగువ ఉన్న చెరువులకు నీటిని పంపుతున్నారు. 243 ఎంసీఎ?అబశ్రీశ్రీఘటీ సామర్థ్యంగల పీటీఎం, 185 ఎంపీఎ?అబశ్రీశ్రీఘటీగల సీటీఎం చెరువులతో పాటు కుప్పం పరమసముద్రం, పెద్దపంజాణి శంకర్రాయులపేట, చాలమంగళం, రంగసముద్రం, పుంగనూరు చెరువులు నిండాయి. హంద్రీనీవా జలాలలతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గాల్లోని 312 పెద్ద, చిన్న చెరువులను నింపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని హెచ్ఎన్ఎ?అబశ్రీశ్రీసఎస్ ఎస్ఈ (మదనపల్లె) విఠల్ ప్రసాద్ తెలిపారు.



# అదిగదిగో ఫ్లెమింగో..!

**క్రైం కౌంటర్ న్యూస్,**తడ/సూళ్లూరుపేట/దొరవారిసత్రం, జనవరి 11 సందర్శకులు, పర్యాటకులతో పులికాట్ సరస్సు పులకించింది. సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహిస్తున్న జరుగుతున్న పక్షుల పండుగ రెండవ రోజు ఆదివారం జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. సెలవుదినం కావడంతో విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రం వద్ద చలి, ఉదయం 11 గంటల సమయంలో మోస్తరు వర్షం కురవడంతో మధ్యాహ్నం వరకు సందర్శకులు తక్కువగా ఉన్నారు. ఆ తర్వాత భారీగా వచ్చారు. మంచి నీటి చెరువుల్లో విడిదిలో ఉన్న విహంగాలను వీక్షించారు. సినీ నటుడు మంచు విష్ణు కుటుంబంతో సందర్శకులతో కలసిపోయి పక్షులను వీక్షించారు. అదిగదిగో ఫ్లెమింగో, ఆ పక్షులు బాగున్నాయి కదూ అంటూ సందర్శకులు బైనాక్యులర్లతో చూస్తూ మాట్లాడుకున్నారు. సెల్ఫీలు దిగారు. తడ మండలం భీములవారిపాళెం పడవలరేవు లో బోటు షికారుకు జనం తరలివచ్చారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో మధ్యాహ్నం తర్వాత ఇరకం దీవికి బోట్లు ఆపేశారు. ఇక, వచ్చిన వాళ్లంతా బోటు షికారు చేయలేక నిరాశతో వెనుదిరిగారు.అటకానితిప్ప వద్ద పులికాట్ సరస్సులో పక్షుల విన్యాసాలను తిలకించేందుకు జనం పోటీపడ్డారు. ప్రత్యేక బస్సులతోపాటు ఆర్టీసీ సైతం నేలపట్టు, భీములవారిపాళెంలకు బస్సులను నడిపింది. అవీ చాలకపోవడంతో కొంతమంది ఆటోలను ఆశ్రయించారు.సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో స్టాళ్ల సందర్శనకు విద్యార్థులు, సందర్శకులు తరలి వచ్చారు. ఉదయం నుంచే మైదానంలో సభా వేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చిన వాళ్లు చెంగాళమ్మను అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కళాశాల మైదానంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీలలో విజేతలకు శాప్ చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బహుమతులను ప్రదానం చేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు జనం పోటెత్తారు. నటీమణులు డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ హాజరై.. కళాకారులతో కలిసి సరదాగా నృత్యాలు చేశారు.

శ్రీసిటీ నుంచి విహంగ వీక్షణంఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ నుంచి హెలిక్యాప్టర్ రైడ్ (విహంగవీక్షణ) ఏర్పాటు చేశారు. శ్రీసిటీ నుంచి బయలుదేరి పులికాట్, శ్రీహరికోట, సూళ్ళూరుపేట, అటకానితిప్ప తదితర ప్రాంతాల మీదుగా శ్రీసిటీకి చేర్చారు. విహంగ వీక్షణకు రూ.4,500 ధర నిర్ణయించినట్లు తెలిసింది. కొన్ని సాంఘి సంక్షేమ హాస్టళ్లలోని కొందరు విద్యార్థులకు హెలికాప్టర్‌లో ఉచిత అవకాశాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ కల్పించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, బీజేపీ నేత వాకాటి నారాయణరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్ రైడ్‌ను ప్రారంభించారు.

# సినిమా



## ఉదయ్ కిరణ్ ఆ సినిమా చేయను అన్నాడు..

టాలీవుడ్ ఇండస్ట్రీలో వెర్సటైల్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ రవిబాబు. ఎన్నో చిత్రాలతో నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. తన వ్యక్తిగత జీవితంలోని కీలక అంశాలను వెల్లడించారు. అలాగే తన కెరీర్ లో సోగ్గాడు సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాను రూ. 2.75 కోట్ల బడ్జెట్‌తో నిర్మించగా.. తొలి వారంలో రూ. 1.50 కోట్లు, రెండో వారంలో రూ. 70-75 లక్షలు వసూలు చేసిందని, శాటిలైట్ హక్కుల ద్వారా కూడా లాభాలు తెచ్చిపెట్టిందని అన్నారు. సోగ్గాడు చిత్రం వాస్తవానికి ఆ కాలంలో అగ్రతారలైన తరుణ్, ఉదయ్ కిరణ్, ఆర్తి అగర్వాల్‌లతో చేయాలని ప్లాన్ చేసుకున్నానని అన్నారు. సినిమా చేయడానికి తరుణ్, ఆర్తి అగర్వాల్‌లు సినిమా చేయడానికి అంగీకరించగా, ఉదయ్ కిరణ్ మాత్రం ఒప్పుకుంటానని, చేయనని పలుమార్లు తన నిర్ణయాన్ని మార్చుకున్నారని చెప్పారు. ఉదయ్ కిరణ్ మద్రాస్‌లో సినిమా చేస్తానని చెప్పడంతో, రవిబాబు సురేష్ బాబుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అయితే, సురేష్ బాబును కలిసిన ఉదయ్ కిరణ్ అనూహ్యంగా సినిమా చేయనని చెప్పడంతో రవిబాబు, సురేష్ బాబు ఇద్దరూ ఆశ్చర్యపోయారు.దీంతో కోపంతో "నువ్వు చేయకపోతే ఏంటి, ఇంకెవరినో పెట్టి నేను చేస్తాను" అని తాను తీసుకున్న నిర్ణయమే సినిమా ఫ్లాప్ కావడానికి కారణమని అన్నారు. ఉదయ్ కిరణ్ స్థానంలో హిందీ నటుడు జుగల్ హన్సరాజ్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. సోగ్గాడు అసలు క్లైమాక్స్ చాలా భిన్నంగా ఉండేదని రవిబాబు చెప్పారు. రైల్వే స్టేషన్‌లో రెండు వేర్వేరు దిశల్లో వెళ్లే రైళ్లలో తరుణ్, ఉదయ్ కిరణ్ ఉంటారు. అమ్మాయి తరుణ్ దగ్గరికి వచ్చి తన మొదటి ప్రేమ ఉదయ్ కిరణ్ అని, తరుణ్ కేవలం సహాయం మాత్రమే చేశాడని చెబుతుంది. తరుణ్ కూడా ఉదయ్ కిరణ్ వద్దకే వెళ్లమని సలహా ఇస్తాడు. అయితే ఉదయ్ కిరణ్, తరుణ్ అంత గొప్పవాడు కాదని, తనకంటే తరుణే అమ్మాయిని బాగా చూసుకుంటాడని చెప్పడంతో అమ్మాయి ఎటు వెళ్లాలో తెలియక మధ్యలో కూర్చుని ఏడుస్తూ ఉంటుందని, చివరకు ఆమె ముందు గులాబీ పువ్వు పడుతుందని, అది ఎవరు వేసిందీ చెప్పకుండా సినిమా ముగుస్తుందని అసలు క్లైమాక్స్ వివరించారు. అయితే, ప్రిడిక్టబిలిటీ కారణంగా ఈ క్లైమాక్స్ మార్చాల్సి వచ్చిందని, అది తామంతా కలిసి చేసిన తప్పేనని రవిబాబు అంగీకరించారు. కష్టమైనా, నష్టమైనా ఉదయ్ కిరణ్‌నే ఒప్పించి ఉండాలని లేదా అసలు సినిమానే తీసి ఉండకూడదని అభిప్రాయపడ్డారు.ఉదయ్ కిరణ్, తరుణ్ ఒకే స్థాయి నటులు కావడం వల్ల వారి మధ్య ఒక అమ్మాయి ఉన్న ప్రేమకథ ఆసక్తికరంగా ఉండేదని, అయితే జుగల్ హన్సరాజ్‌ను పెట్టడం వల్ల కథలో అసమతౌల్యం ఏర్పడిందని, అమ్మాయి తరుణ్‌తోనే వెళ్తుందని ప్రేక్షకులు సులువుగా ఊహించగలిగారని రవిబాబు వివరించారు.





## తినేముందు ఇవి తప్పక తెలుసుకోండి..

బొప్పాయి.. జీర్ణక్రియను మెరుగుపరచడం నుండి బరువు తగ్గడం వరకు దీని వల్ల కలిగే ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. అయితే చలికాలం రాగానే చాలామంది బొప్పాయిని తినడానికి వెనుకాడతారు. దీనికి చల్లబరిచే స్వభావం ఉండటం వల్ల జలుబు, దగ్గు వస్తుందని భయపడుతుంటారు. మరి చలికాలంలో బొప్పాయి తినడం సురక్షితమేనా? ఢిల్లీలోని +దీ హాస్పిటల్ మాజీ పోషకాహార నిపుణురాలు డాక్టర్ అనామిక గౌర్ ఈ విషయంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.చలికాలంలో బొప్పాయి ఎందుకు అవసరం?

సాధారణంగా చలికాలంలో మన శారీరక శ్రమ తగ్గుతుంది. దీనివల్ల మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమయంలో బొప్పాయి మనకు ఒక మంచి స్నేహితుడి లాగా పనిచేస్తుంది.

జీర్ణక్రియకు అమృతం: బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ ఆహారాన్ని త్వరగా అరిగించేలా చేస్తుంది. పేగులను శుభ్రంగా ఉంచి గ్యాస్, ఎసిడిటీ సమస్యలను తగ్గిస్తుంది.రోగనిరోధక శక్తి: ఇందులో విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చలికాలంలో వచ్చే ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షిస్తాయి.

బరువు నియంత్రణ: చలికాలంలో కేలరీలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తింటుంటాం. బొప్పాయిలో ఫైబర్ ఎక్కువ, కేలరీలు తక్కువ. ఇది ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంచి, అనవసరమైన ఆకలిని తగ్గిస్తుంది.

ఎప్పుడు, ఎంత తినాలి?

బొప్పాయి ప్రయోజనాలు అందాలంటే సరైన సమయంలో, సరైన మోతాదులో తీసుకోవడం ముఖ్యం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల శరీరానికి పూర్తి పోషకాలు అందుతాయి. రోజుకు 5 నుండి 6 ముక్కలు లేదా సుమారు 200 గ్రాములకు మించి తీసుకోకపోవడం మంచిది.

చలికాలంలో పాటించాల్సిన నియమాలు:

బొప్పాయి ఆరోగ్యకరమైనదే అయినా చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి.

ఫ్రిజ్ నుండి తీసిన వెంటనే తినవద్దు: చల్లని బొప్పాయిని తినడం వల్ల గొంతు సమస్యలు రావచ్చు. తినడానికి గంట ముందే ఫ్రిజ్ నుండి తీసి, గది ఉష్ణోగ్రతకు వచ్చాక తినాలి.

జలుబు ఉంటే దూరం ఉండాలి: ఇప్పటికే తీవ్రమైన జలుబు, దగ్గు లేదా ఆస్తమా వంటి సమస్యలు ఉన్నవారు ఈ పండును నివారించడం ఉత్తమం. ఒకవేళ తినాలనిపిస్తే, తిన్న తర్వాత కొద్దిగా గోరువెచ్చని నీరు తాగాలి.

మితంగా తినండి: మీ శరీర తత్వం చల్లనిదైతే, అతిగా తినకుండా జాగ్రత్త పడండి.



## ఆలూ తింటే బరువు పెరుగుతారా?

ఆలూ తినడానికి అందరూ ఇష్టపడుతారు. కానీ ఆరోగ్యం, బరువు విషయానికి వస్తే, బంగాళాదుంపలను జనాలు తరచుగా దూరం పెడుతూ ఉంటారు. ఎందుకంటే వీటిలో ఉండే అధిక పిండి పదార్థం తినడం వల్ల ఊబకాయం వంటి సమస్యలు పెరుగుతాయని చాలా మంది అనుకుంటారు. అందుకే చాలా మంది బంగాళాదుంపలకు దూరంగా ఉంటారు. కానీ బంగాళాదుంపలు నిజంగా అంత అనారోగ్యకరమైనవా? అంటే కాదని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. హెల్త్‌లైన్ వెబ్‌సైట్ ప్రకారం, ఆలుగడ్డలను సరైన రీతిలో, సరైన పరిమాణంలో తింటే అవి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయంటున్నారు. అయితే, ఇది మీరు వాటిని ఎలా వండుతున్నారు. ఎంత తీసుకుంటారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది.అపోహ 1: బంగాళాదుంపలు కేవలం కేలరీలు మాత్రమే

బంగాళాదుంపలలో ఎటువంటి పోషకాలు ఉండవని.. వాటిలో కేవలం కేలరీలు మాత్రమే ఉంటాయని చాలా మంది అనుకుంటారు. కానీ అది నిజం కాదు. బంగాళాదుంపలలో సహజ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటుంది. వాటిలో విటమిన్ సి, విటమిన్ బి6, పొటాషియం కూడా పుష్కలంగా ఉంటాయి. దీని అర్థం అలూలో కేవలం కార్బోహైడ్రేట్లు లేదా స్టార్చ్ మాత్రమే కాదు, అనేక ముఖ్యమైన పోషకాలు కూడా ఉన్నాయని. ఇవన్ని ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

అపోహ 2: బంగాళాదుంపలు తినడం వల్ల బరువు పెరుగుతుంది

ఆలూ తినడం వల్ల బరువు పెరగుతామని చాలా మంది అనుకుంటారు. కానీ వాటిని సైరన విధానంలో వండితే అలాంటి సమస్యే ఉండదు. ఆలూతో మీరు ఫ్రెంచ్ ఫ్రైస్, కట్లెట్స్, టిక్కీస్ వంటివి చేసుకొని తింటే మీరు బరువు పెరుగుతారు. ఎందుకంటే ఆలూను డీప్-ఫ్రై చేయడం వల్ల అందులో కొవ్వు, కేలరీలు పెరుగుతాయి. కాబట్టి ఇవి బరువు పెరగడానికి కారణం అవుతాయి. అలా కాకుండా ఉడికించిన, కాల్చిన, బేక్ చేసిన లేదా గ్రిల్ చేసిన బంగాళాదుంపలు తినడం ఉత్తమంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో కొవ్వు, కేలరీలను తక్కువ ఉంటాయి.

అపోహ 3: మధుమేహం ఉన్నవారు ఆలూ తినకూడదు:

ఆలూలో ఎక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (+×) ఉంటుందనేది నిజం, ఇది రక్తంలో చక్కెరను పెంచుతుంది. అయితే, ఇక్కడ అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే.. బ్లడ్‌లో షుగర్ లెవల్స్ పెరగడమనేది.. మీరు ఆలూను తినే విధానం, తీసుకునే పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. అవును ఆలూను ఉడకబెట్టడం వల్ల వాటి పిండి పదార్థం నిరోధక పిండిగా మారుతుంది, ఇది ఫైబర్ లాగా పనిచేస్తుం. రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా నిరోధిస్తుంది.

## వన్డేల్లో ఓపెనర్‌గా అత్యధిక సిక్సర్ల రికార్డు సృష్టించిన రోహిత్ శర్మ

భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మరో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో ఓపెనర్‌గా అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఆదివారం బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో హిట్‌మ్యాన్ ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ క్రమంలో వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ రికార్డును అధిగమించాడు.301 పరుగుల లక్ష్య ఛేదనలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రోహిత్ ఇన్నింగ్స్ ఆరంభించాడు. ఆరో ఓవర్లో మొదటి సిక్స్ కొట్టిన రోహిత్, ఆ తర్వాతి ఓవర్లో కైల్ జేమీసన్ బౌలింగ్‌లో మరో భారీ సిక్స్ బాది రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ సిక్సర్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో 650 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి ఆటగాడిగా కూడా నిలిచాడు. అయితే, ఈ మెరుపు ఆరంభాన్ని రోహిత్ భారీ ఇన్నింగ్స్‌గా మలచలేకపోయాడు. 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 26 పరుగులు చేసి జేమీసన్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు.ఈ మ్యాచ్‌కు ముందు వరకు ఓపెనర్‌గా క్రిస్ గేల్ 328 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉండగా, తాజా మ్యాచ్‌లో రోహిత్ (329) ఆ రికార్డును బద్దలు కొట్టాడు. గతేడాది దక్షిణాఫ్రికా సిరీస్‌లో షాహిద్ అఫ్రిది రికార్డును బ్రేక్ చేసి, వన్డేల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా రోహిత్ నిలిచిన విషయం తెలిసిందే.ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. ఓపెనర్లు డెవాన్ కాన్వే, హెన్రీ నికోల్స్ శుభారంభం అందించగా, డారిల్ మిచెల్ రాణించాడు. భారత బౌలర్లు చివర్లో పుంజుకుని కివీస్‌ను భారీ స్కోరు చేయకుండా కట్టడి చేశారు.




## రికార్డుల వేటలో కింగ్ కోహ్లీ..

భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ తన అద్భుతమైన కెరీర్‌లో మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. తాజాగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌తో కోహ్లీ తన వన్డే కెరీర్‌లో 309వ మ్యాచ్ ఆడుతూ, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ (308 మ్యాచ్‌లు) రికార్డును అధిగమించారు. టీమిండియా తరపున అత్యధిక వన్డేలు ఆడిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ ఇప్పుడు ఒక మెట్టు పైకి ఎగబాకారు. ఫిట్‌నెస్ విషయంలో యువ ఆటగాళ్లకు సైతం సవాలు విసిరే విరాట్, మూడు పదుల వయసు దాటినా అదే ఉత్సాహంతో మైదానంలో పరుగుల వరద పారిస్తున్నారు.

భారత క్రికెట్ చరిత్రలో అత్యధిక వన్డేలు ఆడిన ఆటగాడిగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 463 మ్యాచ్‌లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. సచిన్ తర్వాత ఎంఎస్ ధోనీ (347), రాహుల్ ద్రవిడ్ (340), మహమ్మద్ అజహరుద్దీన్ (334) వంటి దిగ్గజాలు ఈ జాబితాలో కోహ్లీ కంటే ముందున్నారు. ప్రస్తుత ఫామ్ మరియు నిలకడను చూస్తుంటే, కోహ్లీ త్వరలోనే అజహరుద్దీన్ మరియు ద్రవిడ్ రికార్డులను కూడా తుడిచిపెట్టే అవకాశం ఉంది. భారత క్రికెట్‌లో అత్యంత ప్రభావవంతమైన ఆటగాడిగా కోహ్లీ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోంది.

అయితే, విరాట్ కోహ్లీ మున్ముందు ఎన్ని రికార్డులు సృష్టించినా, ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న 347 వన్డేల రికార్డును అందుకోవడం ఒక పెద్ద సవాలుగా కనిపిస్తోంది. ప్రస్తుతం కోహ్లీ తన 309వ మ్యాచ్ ఆడుతుండగా, ధోనీ రికార్డును చేరుకోవడానికి ఇంకా 39 మ్యాచ్‌లు అవసరం. ఒకవేళ కోహ్లీ 2027 వన్డే వరల్డ్ కప్ వరకు తన కెరీర్‌ను కొనసాగించినప్పటికీ, ఏడాదికి భారత్ ఆడే వన్డే మ్యాచ్‌ల సంఖ్య పరిమితంగా ఉండటం వల్ల ధోనీని అధిగమించడం అంత సులభం కాకపోవచ్చు. కేవలం ఫిట్‌నెస్ మాత్రమే కాకుండా, జట్టు మేనేజ్‌మెంట్ తీసుకునే వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ నిర్ణయాలపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది.

ఏది ఏమైనా, భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా విరాట్ కోహ్లీ తన ముద్రను పదిలం చేసుకుంటున్నారు. కేవలం గణాంకాల పరంగానే కాకుండా, మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్‌లు ఆడటంలో ఆయనకు ఆయనే సాటి. గంగూలీని దాటి ముందుకు సాగుతున్న కోహ్లీ, రాబోయే రోజుల్లో మరిన్ని చారిత్రాత్మక విజయాలను టీమిండియాకు అందించాలని అభిమానులు కోరుకుంటున్నారు. 2027 ప్రపంచకప్ నాటికి కోహ్లీ ఏ స్థానంలో నిలుస్తారో చూడాలన్న ఆసక్తి క్రికెట్ ప్రపంచంలో నెలకొంది.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com